పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై ఆగ్రహం


లంకలకోడేరు సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు


మేడపాడులో నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు


మొగల్తూరు 3వ సచివాలయ వద్ద ఆందోళన చేస్తున్న వలంటీర్లు

క్షమాపణ చెప్పాలని వలంటీర్ల డిమాండ్

పాలకొల్లు అర్బన్: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తమ పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణం ఉపసంహరించుకుని భేషరతుగా క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. పాలకొల్లులో సోమవారం వారు మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ డౌన్ డౌన్, వలంటీర్లకు పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలంటూ నినదించారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు తమ మనోభావాలను దెబ్బతీశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గౌరవ వేతనానికి పనిచేస్తోన్న తమను కించపరచడం తగదన్నారు. కరోనా సమయంలో తమ సేవలను ప్రజలంతా మెచ్చుకున్నారని గుర్తు చేశారు. జేసీఎస్ కన్వీనర్ మండల కన్వీనర్ ఎంఎస్ వాసు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు, పెదగోపురం చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, సత్రం చైర్మన్లు నంబూరు గంగా పవన్, మామిడి బాబు, నాయకులు చినిమిల్లి గణపతిరావు, శీలం సూరిబాబు, మద్దా చంద్రకళ, మోర్త గిరీష్, రామాంజుల పెదమధు, పీటర్‌సన్ చిన్ని, రుంకాని దుర్గారావు, లోపింటి చిరంజీవి, రావాడ సతీష్ తదితరులు వలంటీర్లకు సంఘీభావం వ్యక్తం చేశారు.

● లంకలకోడేరు సచివాలయం వద్ద వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. తక్షణం తమకు క్షమాపణ చెప్పకపోతే నిరసనలు కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, జేసీఎస్ కన్వీనర్ పార్శి వెంకటరత్నం, వలంటీర్లు కొడమంచిలి వెంకటలక్ష్మి, చిట్టూరి లక్ష్మీ ప్రసన్న, సోడదాసి శైలజ, కట్టా త్రివేణి వీరమణి, ఏనుగుపల్లి సావిత్రి, గోగులమండ దీపిక, ఏనుగుపల్లి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల ఆగ్రహం

యలమంచిలి: సేవా భావంతో విధులు నిర్వహిస్తోన్న తమ పట్ల పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం యలమంచిలి మండలం మేడపాడులో పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని చించివేసి నిరసన వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదువుకున్న తమను గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సేవ చేసే అదృష్టం కల్పించారన్నారు. సంఘ విద్రోహ శక్తులకు కుటుంబ సభ్యుల వివరాలను చేరవేస్తున్నామని ఆరోపణ చేయడం పవన్‌కు తగదని, తక్షణం తమకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వలంటీర్లు పాలపర్తి సందీప్‌కుమార్, తలుపూరి ప్రవీణ్, కడిమి బాలరాజు, గవర సురేంద్ర, పితాని సాయి, గంధం గణేష్, నేరేడుమిల్లి ప్రవీణ్, చెల్లెం రాజు, హిమబింధు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పవన్ క్షమాపణ చెప్పాలి

మొగల్తూరు: తమపై అనుచిత వ్యాఖ్యలను పవన్ కళ్యాణ్ వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మొగల్తూరు 3వ సచివాలయ వద్ద ఆందోళన నిర్వహించారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తోన్న తమపై నీచమైన వ్యాఖ్యలు చేయడం పవన్‌కు తగదని హితవు పలికారు. కార్యక్రమంలో కాసాని రాజేష్, కొడవలూరి దేవి, చెల్లుబోయిన ధనశ్రీ, నల్లం ఫణి నాగరాజు, దొంగ విజయలక్ష్మి, లక్కు భవాని, కొల్లాటి సంధ్య, బొడ్డు మంగ, ఆశి దీపిక, పిప్పళ్ల సత్యసాయి తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు దుర్మార్గం



పోడూరు: గ్రామ వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అనుచిత వాఖ్యలు దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్‌విభాగం అధ్యక్షుడు కుంచలపల్లి విన్స్టన్‌బాబు ఖండించారు. కవిటంలో ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ప్రాణాలకు తెగించి కరోనా బాధితులకు అందించిన సేవలను గుర్తుచేశారు. వలంటీర్లు మహిళలను ట్రాప్ చేస్తున్నారని ఆరోపించడం సరికాదన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయంలో వలంటీర్, సచివాలయ వ్యవస్థలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే కీలకపాత్ర పోషించనున్నట్టు చెప్పారు. పవన్ కళ్యాణ్ వలంటీర్లపై బురదజల్లి రాజకీయంగా లబ్ధి పొందాలని బరితెగించి మాట్లాడుతున్నాడని ఆరోపించారు. వలంటీర్లకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ వ్యాఖ్యలపై మానవహక్కుల కమిషన్, మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. యూత్ నాయకులు దేవ రాజేష్, బావన సునీల్, ఊటల చిట్టిరాజు, సాలా శ్రీను తదితరులు పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలను ఖండించారు.

వలంటీర్లలో 70 శాతం మహిళలే

పెనుమంత్ర: వలంటీర్ వ్యవస్థతోపాటు వలంటీర్‌లపై నిరాధారమైన ఆరోపణలు చేయడం పవన్‌కల్యాణ్‌కు తగదని పెనుమంత్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణి అన్నారు. ఏలూరు వారాహి యాత్రలో పవన్ కళ్యాణ్ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. వలంటీర్లు గ్రామాల్లో నివాసం ఉంటూ, ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. వలంటీర్లలో 70 శాతం మంది మహిళలే ఉన్న విషయం పవన్ గుర్తించుకోవాలని సూచించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని విమర్శించడం మానుకోవాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేస్తే మహిళలంతా ఉద్యమించే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికే ‘జగనన్న సురక్ష’


దేవలో లబ్ధిదారులకు ధ్రువ పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు

పెనుగొండ: దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున అమలు చేస్తున్నారని వెఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం పెనుగొండ మండలం చినమల్లం, దేవ గ్రామాల్లో జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరంగనాథరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు పేదల సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఎమ్మెల్యేనూ ప్రజల ఇళ్లకు మూడుసార్లు పంపి వారి సమస్యలు తెలుసుకుంటున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తోన్న ఆదరణ చూసి టీడీపీ అధినేత చంద్రబాబుకు మతిభ్రమించిందని, ప్రభుత్వంపై నిరంతరం దుష్ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కూడా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందన్నారు. ఆచంట నియోజకవర్గంలో కొందరు సంఘాలపేరుతో విడదీస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. త్వరలో దేవలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. మునమర్రులో ప్రాథమిక ఆరోగ్యం ప్రారంభిస్తామన్నారు. రూ.17 కోట్లతో దేవ రహదారి పనులు చేస్తున్నామని, గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పుతినీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం, సర్పంచ్‌లు నెల్లూరి సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, మండల కన్వీనర్లు శాఖ సుబ్రహ్మణ్యం, పలివెల శ్రీను, సరెళ్ల లాజరస్, పిల్లి రాంబాబు, డీఆర్‌సీ రాజు, దంపనబోయిన బాబూరావు, ఎంపీటీసీ ఏడుకొండలు, గండ్రేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ


ప్రభుత్వాసుపత్రిలో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు, బాలింతలు

పాలకొల్లు అర్బన్: వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు సహకారంతో సోమవారం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు ప్రధాన మంత్రి మాతృత్వ సమృద్ధి యోజన పథకంలో పౌష్టికాహారం అందజేశారు. మొత్తం 35 మందికి ఖర్జూరం, రసుకులు, బలం అరుకులు అందించారు. కార్యక్రమంలో క్షత్రియ సంక్షేమ పరిషత్ కార్యదర్శి కేవీఎస్‌పీఎస్ వర్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభాకరరావు, కె.రామరాజు, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి


సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్‌విప్, ఎమ్మెల్యే ప్రసాదరాజు

చీఫ్‌విప్, ఎమ్మెల్యే ప్రసాదరాజు

నరసాపురం రూరల్: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కన్వీనర్లు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కోరారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో నరసాపురం నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. నరసాపురం నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఒక్క సచివాలయానికీ ఉన్న ముగ్గురు కన్వీనర్లు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికీ తెలియజేయాలని సూచించారు. తమ ప్రభుత్వం కుల, మత, ప్రాంత, వర్గ, పార్టీ తారతమ్యాలు చూడకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తోందని చెప్పారు. ప్రభుత్వం చేసే మంచి పనులను ప్రజలందరికీ వివరిస్తూ ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని కోరారు. సమస్యల పరిష్కారంలో తానెప్పుడూ ముందుంటానని, ఎవరికి ఏ సమస్య ఉన్నా నిర్మొహమాటంగా తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. కుల, మత, వర్గ విభేదాలు లేకుండా ఐకమత్యంగా కలిసి పనిచేసి సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేద్దామన్నారు. పార్టీని బలోపేతం చేయడంలోనూ, సంక్షేమ పథకాలు సక్రమంగా చేరేలా చూడటంలోనూ కన్వీనర్ల పాత్ర కీలకమని ప్రసాదరాజు వివరించారు. సమావేశంలో పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల తదితరులు పాల్గొన్నారు.

చేపలు, రొయ్యల పెంపకంపై అవగాహన


మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీనివాస్

నరసాపురం రూరల్: భూసార, నీటి పరీక్ష ఫలితాల ఆధారంగానే రొయ్యలు, చేపల సాగు చేసుకోవాలని మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాస్ అన్నారు. జాతీయ మత్స్య రైతుల దినోత్సవం సందర్భంగా నరసాపురం మండలం పసలదీవి గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఉండి వారి ఆధ్వర్యంలో చేపలు, రొయ్యల పెంపకంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చెరువు ఎండగట్టిన అనంతరం భూసార పరీక్ష చేయించి, నివేదిక ఆధారంగా వాడాల్సిన మినరల్స్, కాల్షియం, మెగ్నీషియం వంటివి, సేంద్రియ ఎరువుల మొతాదు నిర్ణయించుకోవచ్చని అన్నారు. వనామీ చెరువుల్లో కాల్షియం, మెగ్నీషియం, పొటాష్ తప్పనిసరిగా పరీక్షించుకుని ప్రతి 15 రోజులకు ఒకసారి 1:2:1 నిష్పత్తిలో ఉండేటట్టు సూచుకోవాలన్నారు. రొయ్య పిల్లను హేచరీల నుంచి సేకరించినప్పుడు తప్పనిసరిగా బీసీఆర్ పరీక్ష చేసి ఈహెపీ, వైరస్ వ్యాధులు లేవని నిర్ధారించుకోవాలని సూచించారు. రొయ్య పిల్ల వేసే ముందు రోజు తాడు 20 కిలోలు, బెల్లం 4 కిలోలు, ఈస్ట్ 100 గ్రాములు ఎకరానికి తగినంత నీటిలో నానబెట్టి రెండు రోజులు నిల్వ ఉంచి చెరువులో చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొట్టు రామాంజనేయులు, ఎంపీటీసీ పులపర్తి రాంబాబు, ఆక్వా సిబ్బంది దివాకర్, రైతులు కొట్టు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్‌లో స్థలం అమ్మకానికి బిడ్ల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో బీఎస్ఎన్ఎల్ స్టోర్ యార్డు స్థలం 4,999 చదరపు గజాలు ఈ వేలం ద్వారా అమ్మకానికి బిడ్లు ఆహ్వానిస్తున్నట్టు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టెలికాం జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను ఒక ప్రకటనలో కోరారు. బిడ్లను ఆగస్టు 3 నుంచి 17వ తేదీలోపు సమర్పించాలని పేర్కొన్నారు. బిడ్లను ఆగస్టు 18, మధ్యాహ్నం 3 గంటలకు తెరవనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్లు 94906 44555, 94901 22622, 94235 65008లో సంప్రదించాలని శ్రీను కోరారు.

విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర ప్రారంభం


నరసాపురంలో ప్రారంభమైన విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర

నరసాపురం రూరల్: జిల్లాలో ప్రభుత్వరంగ విద్యను బలోపేతం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్న కుమార్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నరసాపురం వైఎన్ కళాశాల వద్ద విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర ప్రారంభ కార్యక్రమం పట్టణ అధ్యక్షుడు ఎండీ జాన్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జిల్లా విద్యారంగ అభివృద్ధికి జూలై 10 నుంచి 20వ తేదీ వరకు సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీని అన్ని కోర్సులతో ప్రారంభించాలని, ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను నియమించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు, పి.వాసు తదితరులు మాట్లాడారు. అనంతరం జెండా ఊపి సైకిల్ యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో టి.ప్రసాద్, పి.సాగర్, అనిల్, సూరజ్, ప్రవల్లిక, సిరి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతో పొత్తుకు ఒప్పకోనందుకే ఆరోపణలు

మాజీ ఎంపీ హరిరామ జోగయ్య

పాలకొల్లు సెంట్రల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలతో ఏమి మాట్లాడాలో తెలియక జనసేన ఒంటరిగా వెళుతుందా లేక ఏ పార్టీలతో పొత్తు పెట్టుకుంటుందా.. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో చెప్పాలని ప్రశ్నిస్తున్నారని మాజీ ఎంపీ, కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకుడు చేగొండి హరిరామజోగయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక లేఖను విడుదల చేశారు. టీడీపీతో కలవడం కొందరు జనసేన కార్యకర్తలకు ఇష్టంలేదని, వారిని జనసేన నుంచి దృష్టి మళ్లించడానికే వైఎస్సార్‌సీపీ నాయకులు పైవిధంగా విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఉపాధి అంశాలే జనసేన ఎన్నికల సంక్షేమ హామీలని తెలిపారు. ఈ హామీలు వైఎస్సార్‌సీపీ నవరత్న పథకాలను హతం చేయగల ఆయుధాలని పేర్కొన్నారు.

పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ

సాక్షి, భీమవరం: ప్రజలకు ప్రభుత్వానికి అనుసంధానకర్తలుగా పాత్రికేయులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువుగా తీసుకెళ్లడంలో విస్తృతంగా ప్రచారం కల్పించడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి సహాయ, సహకారాలు అందించాలని జిల్లా కలెక్టర్, అక్రిడిటేషన్ కమిటీ చైర్‌పర్సన్ పి ప్రశాంతి అన్నారు. సోమవారం భీమవరంలోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లాలో 2023 - 2024 కాలపరిమితితో అర్హత కలిగిన మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులను పంపిణీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాలాధికారి, అక్రిడిడేషన్ కమిటీ కన్వీనర్ టి.నాగేశ్వరరావు, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు వేలం నిర్వహించనున్నట్లు రూరల్ ఎస్సై బి.మోహన్‌రావు సోమవారం చెప్పారు. 2020–2021కు సంబంధించి మద్యం కేసుల్లో పట్టుబడ్డ రెండు ద్విచక్ర వాహనాలకు వేలం వేస్తామని, ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

క్లుప్తంగా

లయన్స్ కార్యవర్గ ప్రమాణస్వీకారం



లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ఆపదలో ఉన్నవారికి సహాయ సహకారాలు అందిస్తూ లయన్స్ క్లబ్ సేవలో ముందంజలో ఉంటుందని కృష్ణా జిల్లా పాస్ట్ గవర్నర్ దామెర్ల శ్రీశాంతి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. నూతన అధ్యక్షురాలిగా నిమ్మల అన్నపూర్ణ, సెక్రటరీ మాఘం నారాయణరావు, ట్రెజరర్ దోనెల సత్యనారాయణలచే శ్రీశాంతి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రూ.2.30 లక్షలతో కుట్టుమెషీన్లు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, సైకిళ్లు, వైద్య సేవలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి, ఎన్‌వీవీఎస్ పాపారావు నాయుడు, ఎంవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

దాతల సాయంతో పుస్తకాల పంపిణీ

పాలకోడేరు: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ప్రజలు, దాతల సహకారం అవసరమని శృంగవృక్షం ఎంపీటీసీ సభ్యురాలు సూర్యకళ అన్నారు. శృంగవృక్షం పంచాయతీ పరిధిలోని బంటుమిల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన డీఎస్పీ బండి పెద్దిరాజు రూ.20 వేలు ఆర్థిక సహకారంతో సమకూర్చిన రాత పుస్తకాలు, విద్యా సామగ్రిని సోమవారం విద్యార్థులకు అందజేశారు. స్థానికులు పాలా లక్ష్మీరావు, కడలి సాయిబాబు, బండి వెంకటేశ్వరావు, బొక్కా ప్రసాద్, పాలా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈహెచ్ఆర్ నమోదు తీరు పరిశీలన

ఉండి: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు డీపీఎంఓ డాక్టర్ సుగుణ, ఏఓ డాక్టర్ వెంకటరెడ్డి సోమవారం ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆధార్ కార్డుతో ఈహెచ్‌ఆర్ (ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు) నమోదు తీరును పరిశీలించారు. పీహెచ్‌సీకి వచ్చే ప్రతి రోగి తప్పకుండా ఆధార్‌కార్డు తెచ్చుకోవాలని తెలియపరచాలని వారు సూచించారు. ఎందుకంటే వారి ఆధార్‌కార్డు నంబర్‌తో పాటుగా వారి ఆరోగ్య వివరాలతో ఆన్‌లైన్‌లో వారి రికార్డు నమోదు చేస్తారన్నారు. దీనివల్ల సదరు వ్యక్తి రాష్ట్రంలో ఏ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందినా అక్కడ వారి ఆరోగ్య వివరాలతో కూడిన రికార్డును తీసి పరిశీలించడం ద్వారా సులభంగా రోగికి చికిత్స అందించవచ్చునన్నారు. ఈసేవలను ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పీ ధర్మతేజ్ ఆధ్వర్యంలో అధికారులకు రికార్డుల వివరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

సాక్షి, భీమవరం: గీత కార్పొరేషన్‌కు తక్షణం రూ.5 వేల కోట్లు కేటాయించి రాష్ట్రంలో వృత్తి ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జుత్తిగ నర్సింహమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం భీమవరం డివిజన్ కల్లుగీత సొసైటీ అధ్యక్షులు, గీత కార్మికుల విస్తృత సమావేశం కడలి పాండు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నర్సింహమూర్తి మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేయాలని, గీతవృత్తి ఆధునికీకరణకు నిపుణులతో అధ్యయన కమిటీ వేయాలని, ప్రమాదాలను నివారించడానికి సేఫ్టీ మోకులు ఇవ్వడంతోపాటు నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలు పెట్టి కల్లుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లా సహాయక కార్యదర్శి బొక్కా చంటి, చింతపల్లి వీరాస్వామి, కొమిటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా కన్వీనర్‌గా రమణారావు

భీమవరం అర్బన్: మండలంలో కొవ్వాడ అన్నవరం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్న పీవీఎస్ఎస్‌బీ రమణారావును ఏపీటీఎఫ్1938 అసోషియేషన్ జిల్లా శాఖ కన్వీనర్‌గా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి నియామకం చేశారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. జిల్లా నూతన కన్వీనర్‌గా నియమితులైన రమణారావు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానన్నారు. రమణారావును పలువురు ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

గూడెంలో 29.6 మి.మీ. వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 29.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ సోమవారం తెలిపారు. పెంటపాడు మండలంలో 44.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

నేడు కాపవరం, కొత్తపేటలో సురక్ష సభలు

పాలకొల్లు అర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 9.30 గంటలకు కాపవరం, 10.30 గంటలకు కొత్తపేటలో సభలు నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, పార్టీ శ్రేణులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మార్టేరులో..

పెనుమంత్ర: మార్టేరు గ్రామంలోని రెండు సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు సర్పంచ్ మట్టా కుమారిరాము తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు హాజరవుతారని పేర్కొన్నారు.

మోడి, మొగల్తూరులో..

మొగల్తూరు: మండలంలోని మోడి, మొగల్తూరు 4వ సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న గ్రామ సభలు నిర్వహించనున్నారు. మోడి సభను తహసీల్దార్ జి.అనితా కుమారి, మొగల్తూరు పరిధిలో సభను ఎంపీడీఓ వి.బాబ్జిరాజు పర్యవేక్షిస్తారు.

భూపతి ఎన్నికపై హర్షం

సాక్షి, భీమవరం: వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా భూపతి రవీంద్రరాజు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై జిల్లా సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుమ్మల్ల జకరయ్య సోమవారం భీమవరంలో విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలో జరిగిన సంఘం రాష్ట్ర ఎన్నికల్లో జిల్లాకు చెందిన రవీంద్రరాజు అధ్యక్షుడిగా, మిరియాల లక్ష్మీనారాయణ ఉపాధ్యక్షుడిగా, అనూష ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికయ్యారన్నారు. జిల్లాకు చెందిన వారు రాష్ట్ర సంఘంలో పదవులు పొందడం అభినందనీయమని జక్కరయ్య పేర్కొన్నారు.

మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలి

ఆకివీడు: మహిళలు ఆర్థికశక్తిగా ఎదిగినప్పుడే రాష్ట్ర ఆర్థికాభివృద్ధి మరింత పెరుగుతుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మహిళా సమాఖ్య భవనంలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సభలో భవన నిర్మాణ దాతలకు సత్కారం చేశారు. అనంతరం మహిళలనుద్దేశించి పీవీఎల్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం బాగుండాలంటే మహిళ ఆర్థికంగా ఎదగాలన్నారు. కుటుంబాలు బాగుపడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయన్నారు. మహిళల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని చర్యలూ తీసుకుంటున్నారన్నారు. మహిళల భద్రతకు ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో మహిళలకు పూర్తి రక్షణ ఉందన్నారు. మహిళా పక్షపాతిగా ఉన్న సీఎం వైఎస్ జగన్ స్త్రీనిధి పెంపు, సున్నా వడ్డీ, రుణ మాఫీ వంటివి అమలుజేస్తూ మహిళలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు మహిళలకు రుణమాఫీ చేస్తానని మోసం చేశారన్నారు. ఎన్నికల సమయంలో పసుపు కుంకుమ పేరుతో సెంటిమెంట్‌గా వాడుకోవాలని చూశారని ఆరోపించారు. చంద్రబాబు కుట్రల్ని మహిళలు గుర్తించి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేశారన్నారు. మళ్లీ, మళ్లీ సీఎంగా జగన్ చేసేందుకు, మహిళా అభివృద్ధికి, మహిళా స్వేచ్ఛకు మహిళలంతా కలిసి దీవించాలని కోరారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌ను మహిళలు మరిచిపోకూడదన్నారు. నాలుగేళ్ల పాలనలో పొందిన లబ్ధిని గుర్తించి మద్దతివ్వాలన్నారు. మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పళ్లెం అరుణ కుమారి అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్‌లు నల్లపురాజు రామారాజు, చిట్టిబాబు, నాతిరెడ్డి ఆదిలక్ష్మీ అన్నవరం, మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు మోరా జ్యోతి, కార్యదర్శి పొలిపిరెడ్డి కనకదుర్గ, ఏపీఎం నాగభూషణం నాయుడు, పుప్పాల పండు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ షాపుల వేలానికి నోటిఫికేషన్ జారీ

తాడేపల్లిగూడెం: గూడెం ఆర్టీసీ ప్రాంగణ పరిధిలో దుకాణాలు అద్దెకు ఇస్తున్నామని ఆసక్తి గలవారు సంప్రదించాలని సోమవారం డిపోమేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి తెలిపారు. ఆటో మొబైల్స్, సానిటరీ వస్తువులు గోదాము, గృహోపకరణాలు, లేజర్ కటింగ్ వర్కుషాపు, కూల్ డ్రింక్స్ జనరల్ స్టోర్సు, ఏసీ రిఫ్రిజిరేటర్స్ దుకాణం అద్దెకు ఇస్తామని, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 18వ తేదీ వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను భీమవరం జిల్లా ప్రజారవాణా అధికారి వారి కార్యాలయంలో 19వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలలోపు టెండర్ బాక్స్‌లో వేయాలన్నారు.